క్లుప్తంగా

ఈజీఎస్ ఏపీవో బదిలీ

బెల్లంపల్లిరూరల్: మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం బెల్లంపల్లి మండల ఏపీవోగా విధులు నిర్వర్తిస్తున్న జీనత్ బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఆర్డీవో శేషాద్రి ఉత్తర్వులు జారీ చేశారు. జీనత్‌ను భీమారం మండలానికి బదిలీ చేయగా, ఆమె స్థానంలో ఈజీఎస్‌లో ఈసీ(ఇంజనీర్ కన్సల్టెంట్)గా విధులు నిర్వర్తిస్తున్న అనిల్‌కుమార్‌కు ఇన్‌చార్జి ఏపీవోగా బాధ్యతలు అప్పగించారు.

కాలువ నిర్మాణ పనులకు పంచాయతీ ట్యాంకర్



మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీ పరిధిలో పలు నిర్మాణాల కోసం కాంట్రాక్టర్ శనివారం గ్రామపంచాయతీ(జీపీ)కి చెందిన వాటర్ ట్యాంకర్‌ను వినియోగించుకోవడం చర్చనీయాంశమైంది. పొన్నారంలో డ్రెయినేజీని నిర్మిస్తుండగా గ్రామ పంచాయతీకి చెందిన ట్యాంకర్ వినియోగించడం అధికార దుర్వినియోగమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీపీ పనులకు ఉపయోగించాల్సిన ట్యాంకర్‌ను కాంట్రాక్టర్‌కు అప్పగించి, ప్రజాప్రతినిదులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బెల్లంపల్లిరూరల్: గ్రామీణులు సహకారం అందించడంతో పాటు అధికార యంత్రాంగం సమష్టి గా కృషి చేయడం ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ రాజేందర్ అన్నారు. మండలంలోని లింగాపూర్‌లో శనివారం పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్య నిర్వహణపై అవగాహన పెంచుకొని గ్రామంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు, ఇంకుడు గుంతలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలు వెంటనే చేపట్టేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ అధినాయకత్వం జోక్యం చేసుకోవాలి'

మంచిర్యాలటౌన్: పట్టణ బీజేపీ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పార్టీ కోసం కష్టపడే వారిని అణిచివేసే ధోరణి అవలంబిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు సోమప్రదీప్ చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో ఎదుగుతున్న బీసీ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ, పార్టీకి తీరని నష్టాన్ని చేస్తున్నారని, పార్టీ అధినాయకత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడికి తెలియకుండా తనను పట్టణ ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నానని ప్రకటించడం, దానిని సోషల్ మీడియాలో పోస్టులను పెట్టి పార్టీ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన



మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామంలో రూ.5లక్షల జెడ్పీ నిధులతో నిర్మించే సైడ్ డ్రెయినేజీ పనులను శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం మంగ, జెడ్పీటీసీ వేల్పుల రవి, సర్పంచ్ సంకె లక్ష్మి, ఉప సర్పంచ్ రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

అధికారి మారినా.. పేరు మారలే..!



మంచిర్యాలక్రైం: మంచిర్యాల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన బి.నారాయణ ఇటీవల బదిలీపై నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు వెళ్లారు. బెల్లంపల్లి సీఐగా పని చేసిన ముస్కా రాజు మంచిర్యాల సీఐగా బాధ్యతలు తీసుకొని సుమారు 25రోజులు గడిచినా, అధికారి పేరు మార్చకపోవడంపై సర్వత్ర విమర్శలకు తావిస్తోంది. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌టీఐ యాక్ట్ సమాచారం నోటీస్ బోర్డ్‌పై ఇంక బదిలీపై వెళ్లిన నారాయణ పేరు ఉండడంతో స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు ఇక్కడ ఎస్‌హెచ్‌ఓ ఎవరు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు గమనించడంలేదా, లేక కావాలనే ఉంచుతున్నార అనేది ప్రజల్లో మెదులుతున్న ప్రశ్న.



మంచిర్యాలలో రంజన్లు, కుండలను కొనుగోలు చేస్తున్న పట్టణ ప్రజలు

సండే స్పెషల్

మట్టిపాత్రలపై క్రేజ్..!

- వంటింట్లో మట్టి పాత్రలు..!
- ఆరోగ్యానికి మేలు.. ఆసక్తి చూపుతున్న ప్రజలు

మంచిర్యాలటౌన్: మట్టి పాత్రలు, రాగి పాత్రలు మన ఆరోగ్యానికి మంచివని మన పూర్వీకులు వినియోగించేవారు. ఇప్పటికీ పల్లెల్లో కట్టెల పొయ్యి పైనే మట్టి పాత్రల్లో వంటలను చేయడం కన్పిస్తుంది. కాలక్రమేణ మట్టి పాత్రల వినియోగం తగ్గుతూ వస్తోంది. కానీ ఏటా వేసవికాలం వచ్చిందంటే చాలు ఆదిలాబాద్‌లో తయారు చేసిన రంజన్లు, రాజస్థాన్‌లో తయారు చేసిన కుండలకు గిరాకీ ఎక్కువ. టెక్నాలజీ పెరుగుతుండడంతో వేసవిలో చల్లని నీరు తాగేందుకు ఎక్కువగా ఫ్రిజ్‌లను వినియోగిస్తుంటారు. ఆరోగ్యరీత్యా ప్రస్తుతం ఫ్రిజ్‌లు ఉన్నా, మట్టి పాత్రల్లో చల్లబడిన నీటిని తాగేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. మంచిర్యాలలో వేసవి ప్రారంభానికి ముందే మట్టి పాత్రల అమ్మకాలు ప్రారంభం కాగా, వాటిని కొనేందుకు ప్రజలు వస్తున్నట్లు అమ్మకందారులు చెబుతున్నారు.

పెరిగిన మట్టిపాత్రల వినియోగం...

మట్టి పాత్రలు వాడడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని, ఇందులో వంటలు చేయడంతో పాటు, పెరుగు, మజ్జిగ వంటివి చేసుకోవడానికి వినియోగిస్తున్నారు. అల్యూమినియం, స్టీల్, ఇత్తడితో పాటు వివిధ రకాల ఎలక్ట్రికల్ రైస్‌కుక్కర్స్, రోటీ మేకర్స్ వంటి పాత్రలను వాడుతున్నా, మట్టి పాత్రలపై మక్కువ తగ్గడం లేదు. సీజన్లను బట్టి కాకుండా, అన్ని సీజన్లలో మట్టి పాత్రలు వినియోగిస్తున్నారు. ఆదిలాబాద్ రంజన్లు అంటే చల్లని నీటిని అందించేందుకు ఎంతో పేరున్నవి. వీటిని ఏటా మంచిర్యాలకు పెద్ద ఎత్తున తీసుకువచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చే కుండలు, ఇతర మట్టి పాత్రలు ఎక్కువగా అమ్మకాలు చేస్తున్నారు. రంజన్లు రూ.150 నుంచి రూ. 350వరకు ధరలు ఉండగా, కుండలు రూ.100 నుంచి రూ.250వరకు ఉన్నాయి. వీటికి ట్యాప్‌లను అమరిస్తే ధర మరికాస్త ఎక్కువగా ఉంటుంది. మట్టి జగ్గులు రూ.300 వరకు ఉండగా, మట్టి గ్లాసులు రూ. 30నుంచి రూ. 60, కూజలు రూ.120వరకు అమ్మకాలు జరుపుతున్నారు.



మట్టితో చేసిన వాటర్ బాటిళ్లు



నల్లాలు బిగించిన రంజన్లు, కుండలు

మట్టితో చేసిన జగ్గులు

మట్టి పాత్రలనే కొంటున్నారు..



ఏటా వేసవిలోనే కుండలు, రంజన్లు, మట్టి గ్లాసులు, కూజ, జగ్గులను ఆదిలాబాద్, రాజస్థాన్ నుంచి తెప్పించి అమ్ముతున్నాను. 40ఏళ్లగా ఈ వ్యాపారం చేస్తున్నాం. ప్రజలు మట్టి పాత్రలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. మంచివని, ఆరోగ్యానికి మేలు చేస్తాయని ప్రజలు నమ్ముతున్నారు. అందుకే మట్టి పాత్రలు అన్ని రకాలైనవి ఇప్పుడు అమ్మకానికి వస్తున్నాయి.

– చిందం వజ్రమ్మ, అమ్మకందారు, మంచిర్యాల

ఆరోగ్యానికి మంచివనే...



మట్టి పాత్రల్లోని నీటిని తాగితే ఆరోగ్యానికి మంచివనే కొనుగోలు చేస్తున్నాం. ఫ్రిజ్ నీరు చల్లగా ఉన్నా, ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందుకే కూజలు, మట్టితో చేసిన వాటర్ బాటిల్లు, రంజన్లు ఇంట్లో తప్పనిసరిగా వాడుతున్నాం. వీటి వినియోగం వల్ల చల్లని నీటితో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని నమ్మకం.

– వేములపల్లి సంజీవ్, మంచిర్యాల

ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు
- అభివృద్ధి పనులు ప్రారంభం

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్కే 6 కొత్తరోడ్ అండర్ బ్రిడ్జి నుంచి హనుమాన్ గుడి వరకు రూ.35లక్షలతో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ సిస్టం నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు మన రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి వారి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. నేడు కోల్‌బెల్ట్‌లో అన్ని వార్డుల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అక్కడక్కడ ఏమైనా పెండింగ్‌లో ఉంటే వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. ఏళ్ల నుంచి ఈ ప్రాంత వాసులు ఎదురుచూసిన సింగరేణి ఇళ్ల స్థలాల పట్టాలను కేసీఆర్ ఇప్పించారన్నారు. ఇప్పుడు పట్టాలు వచ్చిన వారు పక్క భవనాలను నిర్మించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పీఏసీ చైర్మన్ సందెల వెంకటేశ్, టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, పట్టణ కౌన్సిలర్లు బౌత్ లక్ష్మి, పంబాల గంగా, వంగ తిరుపతి, బండి పద్మ, కుర్మిళ్ల అన్నపూర్ణ, పూదరి కుమార్, నాయకులు హైమద్, ఎర్రన్న, పీ జనార్దన్, పీ కమలాకర్‌రావు, గరిసే భీమన్న, తోకల సురేశ్, వేల్పుల రవిందర్, రఫీక్‌ఖాన్, కాటం రాజు, విక్రమ్‌లు పాల్గొన్నారు.

'పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి'



నస్పూర్‌లో పనులు ప్రారంభిస్తున్న దివాకర్‌రావు

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేశారు. 10వ వార్డు, 20వార్డులో సీఎస్‌ఆర్ నిధుల నుంచి రూ.2లక్షలు, రూ.5లక్షలతో చేపట్టిన డ్రెయినేజీలను ప్రారంభించారు. 5వ వార్డులో రూ.35లక్షల టీయూఎఫ్‌డీసీ నిధుల నుంచి చేపట్టే డివైడర్ సెంట్రల్ లైటింగ్ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి నూతన పక్కా భవన నిర్మాణ ప్రదేశాన్ని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శనివారం పరిశీలించారు. నూతనంగా ఆసుపత్రి భవనం మంజూరు కావడంతో పాత భవనాన్ని ఇటీవల అధికారులు కూల్చివేశారు. ఈ నెల 15వ తేదీన మంత్రి హరీశ్‌రావు భవనానికి భూమిపూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నస్పూర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న సురేఖ



వ్యాపారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వినోద్

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

నస్పూర్: పట్టణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శనివారం ఆమె పట్టణంలోని 1, 13వార్డుల్లోని కార్మిక వాడలలో ఇంటింటికీ తిరుగుతూ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే, కాంగ్రెస్‌తోనే సాధ్యం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్ శీపతి సుమతి, నాయకులు పెట్టెం శ్రీనివాస్, బండారి సాయి, తిప్పని రేవతి తదితరులు పాల్గొన్నారు.

కాసిపేటలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర

కాసిపేట: మండల కేంద్రంలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమానికి మద్దతుగా మాజీ మంత్రి గడ్డం వినోద్ నాయకత్వంలో శనివారం కార్యక్రమం నిర్వహించగా, జెండా ఎగురవేసి యాత్ర ప్రారంభించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ధరణి పోర్టల్ రద్దు, గ్యాస్, విద్యుత్ ధరలు ప్రజలకు అందుబాటులోకి రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ రత్నం ప్రదీప్, సీనియర్ నాయకులు బన్న ఆశాలు, యూత్ నాయకులు గుండ రాజ్‌కుమార్, శ్యాముల్, ప్రవీణ్, ప్రణయ్, షేక్ షారుఖ్, సురేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



బెల్లంపల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



రామకృష్ణాపూర్: ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తూ...

జన్నారం/బెల్లంపల్లి/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/లక్సెట్టిపేట/చెన్నూర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీ బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జన్నారం, మందమర్రి, బెల్లంపల్లిలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మందమర్రి, చెన్నూర్, రామకృష్ణాపూర్, లక్సెట్టిపేట పోలీస్ స్టేషన్‌లలో సంజయ్‌ను అరెస్ట్ చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీ పెట్టినందుకే కవితపై మోడీ తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారని జాగృతి రాష్ట్ర నాయకుడు సిద్దంశెట్టి సాజన్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి



మహిళలను సన్మానిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని భారతీయ జనతా మహిళ మోర్చా రాష్ట్ర నాయకురాలు లావణ్య అన్నారు. స్థానిక అగర్వాల్ భవన్‌లో శనివారం మహిళ మోర్చా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు. అన్నిరంగాల్లోను పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మహిళలకు ఉన్నత అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. ప్రీతిని హత్య చేసిన వ్యక్తి ఓ రాష్ట్ర మంత్రి బంధువు కావడంతో ఆయనను కాపాడుతున్నారని, ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అనంతరం వివిధ రంగాల్లో విశేషసేవలు అందిస్తున్న మహిళ నాయకురాళ్లు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు సువర్ణ, బీజేపీ నాయకులు తిరుపతి, గోవర్ధన్, కేశవ రెడ్డి, రాజులాల్ యాదవ్, ప్రకాష్, శ్రావణ్‌కుమారపాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ ఉన్నత పాఠశాలకు చెందిన ముడిమడుగుల అరుణ ఎన్‌ఎంఎంఎస్‌లో ఉత్తీర్ణత సాధించి, జాతీయ ఉపకార వేతనానికి ఎంపికై నట్లు హెచ్‌ఎం రాజిరెడ్డి తెలిపారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



సీఐకి స్వాగతం పలుకుతున్న బాలికలు

బెల్లంపల్లి: సైబర్ నేరాలపై బాలికలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం తాళ్లగురిజాల పోలీసుల ఆధ్వర్యంలో మహిళల రక్షణ, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాత్కాలిక ఆనందం కోసం ప్రలోభాలకు, ఆకర్షణలకు గురి కావద్దన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, ఆ ఆశలను వమ్ము చేయకుండా నడుచుకోవాలని సూచించారు. కొంతమంది చదువుకునే దశలో దారి తప్పి జీవితాలను, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల మోములో చిరునవ్వులు చిందించాలని పేర్కొన్నారు. చదువు వల్లనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం పెరగడంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. అవసరం అనుకుంటే తప్పా ఫోన్‌ను ఉపయోగించొద్దని హితవు పలికారు. పరీక్షలు ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామంలో ఉన్న వారికి, నిరక్షరాస్యులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు తెలిపారు. ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి విద్యార్థులు తమవంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్, రోడ్డు సేఫ్టీ, హెల్మెట్ ధరించి వాహనం నడపడం, రోడ్డు నియమాలు పాటించడం తదితర అంశాల గురించి సవివరంగా వివరించారు. ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ... మహిళల రక్షణకు పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు జరగకుండా నిరోధిస్తున్నామన్నారు. పోలీసుశాఖ మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీ టీం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నెన్నెల: ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి మండలానికి రూ.2.24కోట్లు మంజూరయ్యాయి. ఆ పనులు మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉండటంతో ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కుశ్నపల్లి, నందులపల్లి, చిత్తాపూర్, గంగారాం, చిన్నవెంకటాపూర్ గ్రామాల్లో రూ.50లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పూర్తి అయ్యాయి. మెట్‌పల్లిలో రూ.5లక్షల సీసీ రోడ్డు పూర్తి అయింది. మిగితా గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. మండలంలో ఆయా గ్రామపంచాయతీల్లో గతంలో వేసిన రహదారుల్లో కొన్ని చోట్ల నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఏడాదిలోపే గుంతలమయంగా మారి దుమ్ము లేస్తున్నాయి. గడువులోపు పూర్తి చేయాలనే నిబంధనలు ఉండటంతో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



మైలారంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

సీసీ రోడ్లు 12 నుంచి 13 అంగులాల వెడల్పుతో ఆరు అంగులాల మందంతో నిర్మించాలి. నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం ఖచ్చితంగా క్యూరింగ్ చేయాలి. ఇలా చేస్తే పదేళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉంటాయి. ఈ సారైనా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చెన్నూర్: పరీక్షలంటే భయం వీడితే విజయం మీ సొంతమవుతుందని సైకియాట్రిస్ట్ డాక్టర్ సుశీల్‌కుమార్ అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ కళాశాలలో పది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని జయించేందుకు విద్యార్థినులు ధ్యానం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, అంగ్రాజుపల్లి మెడికల్ ఆఫీసర్ జగదీశ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చిరుతల రామాయణం ప్రదర్శన



బెల్లంపల్లిరూరల్: మండలంలోని పాతబెల్లంపల్లిలో చిరుతల రామాయణం అట్టహాసంగా కొనసాగుతోంది. శ్రీరామ భజనమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న చిరుతల రామాయణం మూడో రోజు శనివారం శూర్పనక ప్రవేశం, శోకావళి ఘట్టం నిర్వహించారు. కళాకారులు తమ నాటికతో ఆకట్టుకున్నారు. ఈ చిరుతల రామాయణం తిలకించడానికి గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు తరలి వస్తున్నారు. ఈ నెల 15న శ్రీ సీతారాముల పట్టాభిషేకం జరుగనుంది.

జనరేటర్‌తో సెంట్రల్ లైటింగ్ ట్రయల్ టెస్ట్

భీమారం: మండలకేంద్రంలో ఈ నెల 15న మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా సెంట్రల్ లైటింగ్ సిస్టం ప్రారంభించనుండగా శనివారం ట్రయల్ రన్ నిర్వహించారు. లైటింగ్ ప్రారంభించేందుకు అధికారులు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు బిగించకపోవడంతో రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు జనరేటర్ సహాయంతో లైట్లు వెలిగించి టెస్ట్ చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు అవసరమైన రూ.7.50లక్షలు గ్రామపంచాయతీ తరుపున విద్యుత్తుశాఖకు చెల్లించాలని ఉన్నతాధికారులు ఆదేశించగా, నిధుల కొరత కారణంగా ఆ డబ్బులు చెల్లించలేమని గ్రామ పంచాయతీ సిబ్బంది చేతులెత్తేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంతో మంత్రి పర్యటన ఉంటుందో లేదో అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.